పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

కులకచర్ల, జూన్ 13 : కులకచర్ల గ్రామ పంచాయతీలో ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కులకచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం కులకచర్ల మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధులకు గురయ్యే ప్రమాదముందని, జాగ్రత్త చర్యలు తీసుకుంటే సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొంద వచ్చునని తెలిపారు. పరిసరాల శుభ్రతపై పారిశుధ్యపు కార్మికులతో పాటు ప్రజలు దృష్టిపెట్టాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దూరం అవుతాయని అన్నారు. మురుగు నీటి కాల్వల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, గ్రామంలో ఎక్కడ కూడా నీరు నిల్వరాదని అన్నారు. విచ్చలవిడిగా చెత్త వేయరాదని గ్రామస్తులకు తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బిల్ కలెక్టర్లను రెగ్యులరైజ్ చేయాలి

మున్సిపల్ చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్లకు వినతి

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిల్ కలెక్టర్లు

వికారాబాద్, జూన్ 13 :ఔట్ సోర్సింగ్ బిల్ కలెక్టర్లుగా పని చేస్తున్న వారికి ఉద్యోగ భద్రత, రెగ్యూలరైజ్ చేయాలని వికారాబాద్ మున్సిపల్ బిల్ కలెక్టర్లు కోరుతున్నారు. గురువారం వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరమేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్‌లకు ఉద్యోగ భద్రత, రెగ్యూలరైజ్ చేయాలని కోరుతూ వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికారాబాద్‌లో ఔట్ సోర్సింగ్ బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో మరుకుగా పాల్గొన్నామన్నారు. ఔట్ సోర్సింగ్ బిల్ కలెక్టర్ గా సేవలందిస్తున్న మాకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత, రెగ్యూలరైజ్ చేయాలని కోరారు. వినతి పత్రాలు అందించిన వారు బిల్ కలెక్టర్లు చందర్‌సింగ్, జగదీశ్, అరుణ్, మహిపాల్, సోమయ్య, అశోక్, శ్రీహరి, సాయికుమార్ ఉన్నారు.

పలువురికి ఘన సన్మానం

మైనార్టీ స్కూల్ ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

వికారాబాద్, జూన్ 13 : నీట్ పరీక్షలో నలుగురు విద్యార్థులు సత్తా చాటారని, ఇందుకు కృషి చేసిన పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాళ్లను మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం వికారాబాద్ శివారెడ్డిపేట మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ పకీర రాత్లావత్, వైస్ ప్రిన్సిపాల్ సత్యానంద, వైస్ ప్రిన్సిపాల్ కార్తీక్ కిరణ్‌లను సన్మానించారు. వికారాబాద్ మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ మహమ్మద్ అష్ఫల్ షకీల్, శివారెడ్డి పేట్ మైనార్టీ నాయకులు, రాజీవ్‌నగర్ కాలనీ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బాధిత రైతుకు ఆర్థికసాయం

కులకచర్ల, జూన్ 13 : చౌడాపూర్ మండల పరిధిలోని కొత్తపల్లి అనుబంధ గ్రామమైన లింగన్నపల్లి గ్రామంలో గతవారం పిడుగు పాటుతో వడ్డెర కులానికి చెందిన లాలు 5 గేదెలు మృతి చెందాయి. విషయం తెలుసుకున్న ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ సహచరులైన రామన్నమాదిగ, వెంకటయ్యముదిరాజ్ ద్వారా రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట దత్తు, రాములు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

మధులత (ఫైల్)

తాండూరు రూరల్, జూన్ 13 : పిడుగు పాటుకు పొలంలో పనులు చేస్తున్న మహిళ మృతి చెందింది. కరణ్‌కోట ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు మండలం, కరణ్‌కోట గ్రామంలోని సర్వేనెం.279లోని పొలంలో మధులత (22) కూలీ పనులు చేస్తుండగా, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో పిడుగు పడి మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.రెండు వేల కోట్లు కేటాయించినందుకు కృతజ్ఞతగా తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ కోటూరి మానవతారాయ్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఓయూ క్యాంపస్‌లోని జామై ఉస్మానియా ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మానవతారాయ్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతానని రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సుధాకర్, నరేశ్‌గౌడ్, నాగరాజు, మణికంఠ, అశోక్, విజయ్, శ్రీకాంత్, హేమంత్ పాల్గొన్నారు.

వివిధ కోర్సులకు దరఖాస్తులు

దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ ఒకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్సు కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నిషియన్, డయాలసిస్ అసిస్టెంట్ తదితర కోర్సుల్లో సర్టిఫికెట్ కోర్సును అందించనున్నట్లు పేర్కొన్నారు. డయాలసిస్ అసిస్టెంట్ కోర్సుకు కనీస అర్హత ఇంటర్మీడియట్, మిగిలిన కోర్సులకు కనీస అర్హత పదో తరగతి అని వివరించారు. అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులన్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు వచ్చే నెల 5వ తేదీ ఆఖరని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఫోన్ నం. 83090 37134, 63058 958 67లలో సంప్రదించాలన్నారు.

కొడంగల్ : విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే, ఎంఈవో

ధారూరు : రుద్రారం పాఠశాల విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

విద్యతోనే సమాజంలో గుర్తింపు

విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసిన ఉపాధ్యాయులు

కొడంగల్, జూన్ 13: విద్యను అభ్యసించడం వల్ల ఉన్నత స్థాయిని చేరుకొని సమాజంలో గుర్తింపు లభిస్తుందని శ్రీబాలాజీ కేజీ ఉన్నత పాఠశాల కరెస్పాండెంట్, మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం శ్రీబాలాజీ కేజీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు స్కూల్ యూనిఫాంతో పాటు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యను ప్రోత్సహించే విధంగా విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం, పాఠ్యపుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థి దశలో శ్రద్ధతో చదువుకుంటే రానున్న రోజుల్లో మంచి భవిష్యత్ ఉంటుందని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా జీవనాన్ని గడిపే ఆస్కారం ఉంటుందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో రాంరెడ్డి, పాఠశాల పాఠశాల జాయింట్ సెక్రటరీ జయతీర్థాచారి, ప్రధానోపాధ్యాయులు వెంకటయ్యతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కులకచర్ల మండలం అంతారంలో విద్యార్థులకు దుస్తులను అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు హన్మంతు, చైర్‌పర్సన్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ధారూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తూ విద్యా బోధన చేస్తున్నదని, ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యనూ అందించనున్నట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థులకు యూనిఫాంస్, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. గురువారం ధారూరు మండల పరిధిలోని రుద్రారం, తదితర గ్రామాలోని వివిధ పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను బలోపేతం చేయడానికి తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు సహకారం అందించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలన్నారు.

కొనసాగుతున్న బడిబాట

కులకచర్ల : కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో బడిబాట కార్యక్రమాన్ని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ప్రభుత్వం ద్వారా అందజేసిన ఏకరూప దుస్తులను అందజేస్తున్నారు. పాఠశాలల్లో చేర్చేందుకు కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్న పాఠశాల హెచ్‌ఎం

పెద్దేముల్, జూన్ 13 : విద్యార్థులకు పాఠశాలలో తాగునీరు, మూత్రశాలలు, విద్యుత్ సౌకర్యం లాంటి సకల సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని అడికిచెర్ల పాఠశాల హెచ్‌ఎం పాండు రంగం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ హేమలత, ఐకేపీ సీసీ మంజుల అన్నారు. గురువారం మండల పరిధిలోని అడికిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.లక్ష అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల నిధులతో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించడానికి నిర్మించిన నూతన వాటర్ ట్యాంకు, నల్లాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం పాండు రంగం మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలను కల్పించడానికి ప్రత్యేకంగా నిధులు సమకూర్చి మరమ్మతులు చేయడం శుభపరిణామం అన్నారు. విద్యార్థులు ఆసక్తితో చదువు కోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

దోమ, జూన్ 13: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 15 శనివారం ఉదయం 11 గంటల సమయంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనసూయ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహేశ్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల ఉపాధ్యక్షుడు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, మండల స్పెషల్ ఆఫీసర్, మండల, డివిజన్ స్థాయి అధికారులు సమావేశానికి సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పదోన్నతులతో పోస్టుల భర్తీ

బొంరాస్‌పేట, జూన్ 13 : ప్రభుత్వం చేపట్టిన పదోన్నతుల ద్వారా కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట, దుద్యాల, కొడంగల్, దౌల్తాబాద్ మండలాల్లో ఖాళీగా ఉన్న జీహెచ్‌ఎం పోస్టులు భర్తీ అయ్యాయి. ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు సీనియారిటీ ప్రాతిపదికన జీహెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించారు. బొంరాస్‌పేట మండలంలోని చౌదర్‌పల్లి ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎంగా రవీందర్, దుద్యాల మండలం హకీంపేట జీహెచ్‌ఎంగా నరేందర్, కుదురుమల్ల జీహెచ్‌ఎంగా ప్రతాప్‌రెడ్డి, దుద్యాల జీహెచ్‌ఎంగా విజయరామారావు, కొడంగల్ బాలుర ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎంగా వెంకటేశ్వర్లు, అంగడిరాయిచూరు జీహెచ్‌ఎంగా మురళీధర్, రుద్రారం జీహెచ్‌ఎంగా సీతాదేవి, హస్నాబాద్ జీహెచ్‌ఎంగా నర్సింహులు, రావులపల్లి జీహెచ్‌ఎంగా చంద్రశేఖర్, దౌల్తాబాద్ మండలం బాలంపేట జీహెచ్‌ఎంగా శ్రీనివాసులు, చెల్లాపూర్ జీహెచ్‌ఎంగా హన్మంతు పదోన్నతులపై వచ్చారు. వీరంతా వివిధ జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో ఎస్‌ఏలుగా, భాషా పండితులుగా పని చేస్తూ జీహెచ్‌ఎంలుగా పదోన్నతి పొందారు. బొంరాస్‌పేట మండలం చౌదర్‌పల్లిలో సోషల్ ఎస్‌ఏగా పని చేస్తున్న శ్రీహరిరెడ్డి దౌల్తాబాద్ జీహెచ్‌ఎంగా, అంగడిరాయిచూరులో పని చేస్తున్న అరుణజ్యోతి ఉర్దూ మీడియా బషీరాబాద్ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎంగా పదోన్నతి పొందారు.

నూతన జీహెచ్‌ఎంగా సునీత నియామకం

పెద్దేముల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నూతన జీహెచ్‌ఎం సునీత అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నూతన జీహెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన సునీత మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా వికారాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (హిందీ)లో పనిచేస్తున్న ఆమె పెద్దేముల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెడ్ మాస్టర్‌గా నియామకమైనట్లు తెలిపారు. మొదటి రోజు పదవీ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో తోటి ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కలిసికట్టుగా అంకితభావంతో పనిచేస్తానని ఆమె అన్నారు. తోటి ఉపాధ్యాయులు జీహెచ్‌ఎం సునీతాకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో తోటి ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడుతున్న జీహెచ్‌ఎం సునీత

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు సన్మానం

దోమ, జూన్ 13 : మండల పరిధిలోని దాదాపూర్, అయినాపూర్, మోత్కూర్, దిర్సంపల్లి, దోమ బాలుర, బాలికల, గుండాల ఉన్నత పాఠశాలలకు పదోన్నతుల ద్వారా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా వచ్చిన అమర్నాథ్, బాబుచంద్, మల్లేశ్, వెంకటయ్య, ఆంజనేయులు, శ్రీనివాసులు, మల్లారెడ్డిలను గురువారం దోమ మండల శాఖ పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ కేశవులు, ప్రభాకర్‌రెడ్డి మండల శాఖ పక్షాన స్వాగతం తెలుపుతూ గురువారం నూతనంగా విధుల్లో చేరిన దాదాపూర్ పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు అమర్నాథ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోపాల్, లాల్య, కృష్ణయ్య, భీమయ్య, వీరప్ప, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దుర్గామాత ఉత్సవాలు

ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

బొంరాస్‌పేట, జూన్ 13 : బొంరాస్‌పేటలో రెండు రోజులపాటు నిర్వహించిన దుర్గామాత ఉత్సవాలు గురువారం ముగిశాయి. గురువారం చేనేత పనివాళ్ల నుంచి అమ్మవారికి చీరను, గీత కార్మికుల ఇంటి నుంచి ఘటాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. సాయంత్రం దేవాలయం ప్రాంగణంలో ఏర్పులమ్మ రంగం కార్యక్రమంలో భవిష్యవాణి వినిపించారు. అనంతరం పోతరాజు విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఉత్సవాలను తిలకించడానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

పోతరాజు విన్యాసం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

ప్రమాదానికి కారణమైన లారీ

దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితులు

నుజ్జునుజ్జయిన ఆటో

మరో ఏడుగురికి తీవ్ర గాయాలు
క్షతగాత్రులను పరామర్శించిన డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, జూన్ 13 : పెళ్లి చూపులకు 15 మందితో వెళ్తున్న ఆటోను లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ఏడుగురికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం పులుసుమామిడి గేటు సమీపంలో జరిగింది. పోలీసులు, బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నవాబుపేట మండలం ఎల్లకొండ గ్రామానికి చెందిన 15 మంది ఆటోలో వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లిలో పెళ్లి చూపులకు బయలు దేరారు. సిద్దులూరు మీదుగా వికారాబాద్ వస్తున్న ఆటోను వికారాబాద్ మండలం పులుసుమామిడి గేట్ సమీపంలో ఎదురుగా వచ్చిన సిమెంట్ ట్యాంకర్ లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కిష్టయ్య (55) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన వారిని స్థానికులు 108లో వికారాబాద్ ఏరియా దవాఖానకు తరలించి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్, ఇతర దవాఖానలకు తరలించారు. బాధితులను వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించి, ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు వెళ్తున్న బుచ్చమ్మ (50) మార్గమధ్యలో మృతి చెందింది. ఆటో డ్రైవర్ షాకీర్, గొల్లగూడ కిష్టయ్య, గొల్లగూడ సత్యమ్మ, గొల్లగూడ అంతయ్య, జోగు రామచంద్రయ్య, బోడ పుష్పమ్మ, పర్వేద పార్వతమ్మ, జంగయ్య, నర్సింహులు, రత్నమ్మ, బోడ లక్ష్మి, చంద్రమ్మ, జంగమ్మలకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

బీపీఎస్ఎల్పీ రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఏఎస్ఎల్‌పీ పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీఏఎస్ఎల్‌పీ మొదటి, రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, మూడు, అయిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కుమెమోలను మూడు వారాల తరువాత సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి, ఈ నెల 20లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

18 నుంచి సెట్ తరగతులు

ఓయూలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెట్)లో ఈ నెల 18నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు సెట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవిన్ సోడ తెలిపారు. 'ఎ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్' పేరుతో ఆఫ్‌లైన్‌లో నిర్వహించే రెండు నెలల కోర్సుకు ప్రతి రోజూ ఉదయం ఆరున్నర గంటల నుంచి ఎనిమిది గంటల వరకు, సాయంత్రం అయిదున్నర గంటల నుంచి ఏడు గంటల వరకు వేర్వేరుగా ప్రత్యేక బ్యాచ్‌లను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 17లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు ఫోన్ నంబర్లు 97035 89689, 79899 03001.

బీ ఫార్మసీ పరీక్షా ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని బీ ఫార్మసీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. బీఫార్మసీ (బీసీఐ) సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని చెప్పారు.

హోటల్ మేనేజ్‌మెంట్ పరీక్షా తేదీలు

ఓయూ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల (బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు తెలిపారు. ఈ కోర్సులు రెండు, ఆరో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మొదటి, ఐదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 26 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూడచ్చన్నారు.

ఉద్యమ కళాకారుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం

కళాకారుల సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు మహేశ్

కందుకూరు, జూన్ 13: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమ కళాకారులను ఆదుకోవాలని కళాకారుల సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు మహేశ్ కోరారు. తమ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కందుకూరు మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్ హాలులో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడానికి చేసిన ఉద్యమ సమయంలో కాలికి గజ్జ కట్టి గోషి గొంగడి వేసుకొని గ్రామ గ్రామాన తిరిగి గొంతెత్తి ధూంధాంలు లాడిన ఆట గొంతులు మూగపోయాయని గుర్తుచేశారు. గ్రామీణ కళాకారులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు. కళాకారులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. తినడానికి తిండి, ఉండటానికి ఇళ్లు లేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే తమను గుర్తించి ఇంటి స్థలంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని ఆయన కోరారు. లేని పక్షంలో ప్రభుత్వంపై పోటారం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాకారులు దన్నారం జంగన్న, శివకుమార్, కిరణ్ కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

కందుకూరు, జూన్ 13: విద్యార్థులు ఇష్టపడి చదువు కోవాలని ఎంపీపీ మంద జ్యోతిపాండు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా తిమ్మాపూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత దుస్తులు, నోటు, పాఠ్య పుస్తకాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. బడి ఈడు పిల్లలను తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. విద్యలో విద్యార్థులు రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. మధ్యాహ్న భోజనంతో పాటు ప్రభుత్వం అన్ని వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.